**జాతీయస్థాయిలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ ప్రవేశపరీక్ష... జేఈఈ మెయిన్. దీనిలో ప్రశ్నలన్నీ విద్యార్థి విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉంటాయి. ఈ పరీక్ష ద్వారా ప్రవేశం కల్పించే ఎన్ఐటీలు, డీమ్డ్ యూనివర్సిటీల్లో విద్యావిధానం సమగ్రంగా ఉంటుంది. కాబట్టి ప్రవేశపరీక్షల్లోని ప్రశ్నలస్థాయి కూడా అదేవిధంగా ఉంటుంది. జేఈఈ మెయిన్ రాసేవారు రాబోయే కొద్ది రోజుల్లో ఎలా సిద్ధం కావాలి? పరిశీలిద్దాం!**




### ఎన్ని మార్కులకు ఏ ర్యాంకు?

2017 జేఈఈ మెయిన్ ఆలిండియా స్థాయి

| ర్యాంకు | మార్కులు | శాతం |
|---|---|---|
| 10లోపు | 345 | 95.8 |
| 100లోపు | 318 | 88.3 |
| 500లోపు | 291 | 80.8 |
| 1000లోపు | 275 | 76.4 |
| 2000లోపు | 254 | 70.6 |
| 3000లోపు | 240 | 66.7 |
| 4000లోపు | 230 | 63.9 |
| 5000లోపు | 222 | 61.7 |
| 6000లోపు | 214 | 59.4 |
| 7000లోపు | 209 | 58.1 |
| 8000లోపు | 203 | 56.4 |
| 9000లోపు | 198 | 55 |
| 10,000లోపు | 193 | 53.6 |
| 20,000లోపు | 162 | 45 |

# మెయిన్‌కు... మెరుగులు!

'ఏదైనా పనిని చేసేముందు మూడు ప్రశ్నలను సంధించుకో. ఈ ప్రశ్నలకు మనస్ఫూర్తిగా సమాధానం లభించినపుడు మాత్రమే ఆ పని చేయడానికి సిద్ధపడు' అని చాణక్యుడు అంటాడు.

ఆ ప్రశ్నలు- 1. నేను ఎందుకు ఆ పని చేస్తున్నాను? 2. ఫలితం ఏమొస్తుంది? 3. నేను దానిని పూర్తి చేయగలనా?

బీఈ/ బీటెక్, బీఆర్క్ కోర్సుల్లో ఎన్ఐటీలు, ఐఐటీలు, ప్రభుత్వ అనుబంధ కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందడానికి ఇంటర్ పరీక్షలు ముగించుకున్న 12 లక్షల మందికి పైగా విద్యార్థులు రాసే పరీక్షలు త్వరలోనే ఉన్నాయి. జేఈఈ మెయిన్స్-2018 రాసే ప్రతి విద్యార్థీ చాణక్యుడు చెప్పిన ప్రశ్నలు సంధించుకుని, దాని కోసం క్రియాశీల నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసింది.



ఈ పరీక్షను ఏప్రిల్ 8న ఆఫ్‌లైన్ విధానంలోనూ, ఏప్రిల్ 15, 16 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలోనూ నిర్వహించనున్నారు. మన తెలుగు రాష్ట్రాల నుంచి ఎప్పటిలాగే ఈ విద్యాసంవత్సరం కూడా ఎక్కువమంది విద్యార్థులు ఆఫ్‌లైన్ పరీక్షకే మొగ్గు చూపారు.

❖ జేఈఈ మెయిన్ 2018 ఆలిండియా ర్యాంకు ఆధారంగా ఐఐటీలు, దేశంలోని కొన్ని టాప్ ఇంజినీరింగ్ కళాశాలల్లో నేరుగా ప్రవేశం పొందవచ్చు. ❖ జేఈఈ మెయిన్ 2018లో వచ్చే ర్యాంకు ఆధారంగా 2,24,000 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018 రాయడానికి అర్హత సాధిస్తారు.



**ఎం. ఉమాశంకర్**
**శ్రీచైతన్య విద్యాసంస్థలు**

## వెయిటేజీని గమనించాలి

పరీక్షకు సన్నద్ధమయ్యేటపుడు ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు, ఏయే అంశాలను ఎక్కువగా కవర్ చేస్తున్నారనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. వెయిటేజీని గమనించి సన్నద్ధమవ్వాలి. దానికి తగిన ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్‌లో.. మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో ఏయే అధ్యాయాల నుంచి కచ్చితంగా ప్రశ్నలు వస్తాయో తెలుసుకోవాలి.

**మేథ్స్:** మాట్రిసెస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, ప్రోగెషన్స్, కాంప్లెక్స్ నంబర్స్, మేథమేటికల్ రీజనింగ్, ప్రాబబిలిటీ, సర్కిల్స్, కానిక్ సెక్షన్స్, ప్లేన్స్ అండ్ లైన్స్, కాలిక్యులస్ మొత్తం అధ్యాయాలు.

**ఫిజిక్స్:** ఎర్రస్, రిజిడ్ బాడీ డైనమిక్స్, వర్క్ పవర్ ఎనర్జీ, గ్రావిటేషన్, ప్రాపర్టీస్ ఆఫ్ మేటర్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ అంశాలు.

**కెమిస్ట్రీ:** ఆర్గానిక్ కెమిస్ట్రీలో- జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్డ్ రియాక్షన్స్, ఎరోమాట్రిసిటీ, కార్బోహైడ్రేట్స్, అమైనోయాసిడ్స్. ఫిజికల్ కెమిస్ట్రీలో- మోల్ కాన్సెప్ట్స్, సొల్యూషన్స్, సాలిడ్ స్టేట్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనెటిక్స్, థర్మోడైనమిక్స్. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో- పిరియాడిక్ ప్రాపర్టీస్, కెమికల్ బాండింగ్, కాంప్లెక్స్ కాంపౌండ్స్, ఎస్, పీ, డీ, ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్, మెటలర్జీ మొదలైనవి. ముఖ్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల పుస్తకాలను ప్రామాణికంగా తీసుకోవాలి.

## ప్రశ్నల శైలి.. ఎలా?

మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి విద్యార్థి విశ్లేషణాత్మక కోణాన్ని పరిశీలించడానికి కింది తరహా ప్రశ్నలను అడుగుతున్నారు.

**1. ఫార్ములా బేస్డ్:** ఈ విభాగంలో ప్రతి సబ్జెక్టు నుంచి కనీసం 15% నుంచి 20% ప్రశ్నలను అడుగుతున్నారు. పైన ఇచ్చిన సబ్జెక్టులవారీ అంశాల్లో అతి ముఖ్యమైన స్టాండర్డ్ ఫార్ములాలను సాధన చేయాలి. సంబంధిత న్యూమరికల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తూ సన్నద్ధమవడం ముఖ్యం.

**2. లాజిక్, కాన్సెప్ట్ బేస్డ్:** ఈ విభాగంలో ప్రతి సబ్జెక్టు నుంచి కనీసం 30 నుంచి 35 శాతం ప్రశ్నలను అడుగుతున్నారు. ఎక్కువ మార్కులు సాధించడానికి అవకాశమున్న విభాగమిది. దీని కోసం www.cbse.nic.in లో ఇచ్చిన సీబీఎస్ఈ 12 బోర్డు ప్రశ్నపత్రాలు, వాటిలోని ప్రశ్నల సరళిని అర్థం చేసుకోవడం ఈ సమయంలో ఎక్కువ ప్రాధాన్యమివ్వాల్సిన అంశం.

**3. ప్రాక్టికల్ అప్లికేషన్ బేస్డ్:** వీటి నుంచి సుమారు 15 నుంచి 20 శాతం ప్రశ్నలను విద్యార్థికి సబ్జెక్టుపై ప్రాక్టికల్ నాలెడ్జ్ అప్రోచ్ తెలుసుకునేలా అడుగుతున్నారు.

**4. స్టాండర్డ్, ప్రీవియస్ మోడల్స్:** పాత ఐఐటీ జేఈఈ ప్రశ్నపత్రాల్లో ఉన్న ఒక మార్కు లేదా రెండు మార్కుల ప్రశ్నలు, వాటిలోని కాన్సెప్ట్స్ ప్రాతిపదికగా లేదా వాటిని చిన్న చిన్న న్యూమరికల్స్ మార్పు చేసి ప్రశ్నలను అడుగుతున్నారు. వీటి నుంచి సుమారు 20 నుంచి 25% ప్రశ్నలు వస్తున్నాయి. ప్రాత ప్రశ్నపత్రాలపై పట్టు సాధిస్తే సులభంగా మార్కులు సంపాదించుకునే విభాగమిది.

**5. హయ్యర్ లెవెల్ థాట్ ప్రొవోకింగ్ ప్రశ్నలు:** ఇవి సుమారుగా 10 నుంచి 15% వరకు అడుగుతున్నారు. ఇవి కొద్దిగా సమయం తీసుకునేవిగా, విద్యార్థి భాషలో చెప్పాలంటే కాస్త పొడవుగా ఉంటాయి. ఉత్తమ ర్యాంకు సాధన ఈ విభాగ ప్రశ్నలను సాధించడంపై ఆధారపడి ఉంటుంది.

## తక్కువ సమయంలో...

ఒక నిమిషంలో జీవితం ఏమీ మారదు కానీ.. ఆ ఒక్క నిమిషం ఆలోచించి తీసుకునే నిర్ణయం మాత్రం జీవితాన్ని మారుస్తుంది. ప్రతి సబ్జెక్టులో పైన తెలిపిన అంశాల నుంచి కచ్చితంగా ఒకటి లేదా రెండు ప్రశ్నలు రావడానికి ఆస్కారం ఉంది. అందువల్ల ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ప్రతి సబ్జెక్టులో మొదటగా పైన పేర్కొన్న అధ్యాయాల నుంచి షార్ట్ నోట్స్ తయారు చేసుకోవాలి.

ముఖ్యంగా ఎన్‌సీఈఆర్‌టీ కెమిస్ట్రీ లైన్ బై లైన్ ఒక నవలలా చదవాలి. దానిలోని ముఖ్యాంశాలను పైన పేర్కొన్న కెమిస్ట్రీ అధ్యాయాలపై ముఖ్యాంశాలతో కూడిన షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి. వాటిని ఆ టాపిక్స్‌లో ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు వర్తింపజేసి తద్వారా షార్ట్ నోట్స్‌లోని అంశాలను మెరుగుపరచుకోవాలి. ఒక గంటలో కనీసం రెండు పెద్ద టాపిక్స్ పూర్తయ్యేలా ముఖ్యమైన అంశాలతో కూడిన షార్ట్ నోట్స్ తయారు చేసుకుంటే సమయం ఆదా అవుతుంది. దీనికి సంబంధించిన అంశాలను అధ్యాపకులతో చర్చించి వాటిని ఆచరణలో పెట్టడం ఉపయోగకరం.

ఈ మధ్యకాలంలో జేఈఈ మెయిన్ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ప్రశ్నపత్రాల్లో పాత ఐఐటీ జేఈఈ స్క్రీనింగ్, మెయిన్స్ పేపర్‌లో ఇచ్చిన 1, 2 మార్కుల ప్రశ్నలను కాస్త మార్చి అదే కాన్సెప్టులపై అడుగుతున్నారు. రాబోయే 2, 3 వారాల్లో అన్ని సబ్జెక్టుల్లో వీటిపై దృష్టిసారించడం మేలు.

## సన్నద్ధత వృథా చేయొద్దు

జేఈఈ మెయిన్‌కు మొదటగా కావాల్సింది స్కోరింగ్. ఇందులో ఫిజిక్స్, మేథ్స్, కెమిస్ట్రీల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ మాదిరిగా విడివిడి కటాఫ్ మార్కులు ఉండవు. కాబట్టి పరీక్షహాలులో ప్రశ్నపత్రంలో ముందు ఏ సబ్జెక్టుపై ప్రశ్నలు తేలికగా ఇచ్చారో దానిని గమనించి ఒక నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తిచేసి ఆ తరువాత నచ్చిన సబ్జెక్టులోని ప్రశ్నలపై దృష్టి సారించాలి.

ఇచ్చిన 4 సమాధానాల్లో సరైనదాన్ని ఎన్నుకోవడమే. ఆబ్జెక్టివ్ ప్రశ్నల సన్నద్ధతలో కీలకం. మిగిలిన మూడు సమాధానాలు ఎందుకు సరైనవి కావో తెలుసుకోవడం సబ్జెక్టుపై మరింత అవగాహన పెంచుతుంది.

మేథ్స్‌లో కనీసం 2, 3 ప్రశ్నలు సబ్‌స్టిట్యూషన్ టెక్నిక్ ద్వారా సమయం వృథా కాకుండా సాధించేలా ఉంటాయి. ఏదేమైనా జేఈఈ మెయిన్ పోటీపరీక్షల్లో మూడు సబ్జెక్టులకు ముందుగా, ఒక్కోదానికి 45 నిమిషాలు కేటాయించటం; మిగిలిన సమయాన్ని నిడివి ఎక్కువున్న ప్రశ్నల సాధనకు ఉపయోగించుకోవటం.. అద్భుత ఫలితాలను అందిస్తుంది.

❖ కనీసం పదేళ్ల పాత జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పేపర్లలోని ప్రశ్నలు, వాటి వెనకున్న కాన్సెప్టులు, ఫార్ములాలపై అధ్యయనం చేసి పట్టు సాధించడం అవసరం.

❖ http://jeemain.nic.inలో కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్టులను ఉంచారు. వీటిని విద్యార్థులు ఉపయోగించుకోవచ్చు. అలాగే జేఈఈ మెయిన్ వెబ్‌సైట్‌లో 2017 ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ప్రశ్నపత్రాలున్నాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని, ప్రశ్నలపై అవగాహన పెంచుకోవచ్చు.

### బలహీనతలను బలంగా మార్చుకోవాలి

ముఖ్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో కొన్ని అంశాలను బట్టీపట్టాల్సిన అవసరం ఉంటుంది. దానిపై విముఖత చూపకుండా సుముఖతతో సన్నద్ధం కావాలి. ఏటా ప్రశ్నపత్రంలో ఏదో ఒక సబ్జెక్టు కఠినంగా/ నిడివిగా/ ఎక్కువ శాతం న్యూమరికల్స్ కలిగినవి ఉంటాయి. ఇలాంటి ప్రశ్నలు గరిష్ఠంగా 3 నుంచి 4 వరకు ఉండొచ్చు. అయితే ప్రశ్నను చదవడంతోపాటే వాటి స్థాయిని పరీక్షించుకోవడం కూడా పోటీపరీక్షల సన్నద్ధతలో ఒక ముఖ్యభాగం అని మరచిపోవద్దు.

ఫిజిక్స్‌లో మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ, హీట్ అండ్ థర్మోడైనమిక్స్‌లో న్యూమరికల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. వాటితోపాటు వాటి వెనుకనున్న కాన్సెప్టులపై సమగ్ర విశ్లేషణతో కూడిన విషయాన్ని అవగాహన చేసుకోవాలి. స్పష్టమైన సమాధానం వచ్చే వరకూ పేపర్‌పై సాధన చేయడం ఎంతో ముఖ్యం.

గణితంలో కనీసం 2 నుంచి 3 ప్రశ్నలు కాస్త ఎక్కువ సమయం తీసుకునేలా ఉండవచ్చు. ఇలాంటి సమయంలో మీరు తీసుకునే నిర్ణయంపైనే మీ విజయం ఆధారపడి ఉంటుంది. దానిని సక్రమమైన మార్గంలో పెడితే మంచి అవగాహన వస్తుంది. చిన్న చిన్న తప్పిదాలు చేయకుండా ఉండవచ్చు.

---

## లైబ్రరీ

కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల మార్కెట్‌లోకి విడుదలైన పుస్తకాల వివరాలు.




### ఆర్ఆర్‌బీ

1) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి (తెలుగులో) పేజీలు: 800, ధర: రూ. 449 2) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి టాప్ 25 మోడల్ పేపర్స్ (తెలుగులో) పేజీలు: 192, ధర: రూ. 149 3) అసిస్టెంట్ లోకోపైలెట్స్, టెక్నీషియన్స్ టాప్ 29 మోడల్ పేపర్స్ (తెలుగులో), పేజీలు: 200, ధర: రూ. 139 4) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి (ఇంగ్లిష్‌లో) పేజీలు: 720, ధర: రూ. 439 5) అసిస్టెంట్ లోకోపైలెట్స్, టెక్నీషియన్స్ (ఇంగ్లిష్‌లో) పేజీలు: 656, ధర: రూ. 399 6) అసిస్టెంట్ లోలోపైలెట్స్, టెక్నీషియన్స్ టాప్ 31 మోడల్ పేపర్స్ (ఇంగ్లిష్‌లో), పేజీలు: 176, ధర: రూ. 149 **ప్రచురణ:** విజేత కాంపిటీషన్స్

### గురుకులాలు

తెలంగాణ- గురుకుల్ సెట్ (ఇంగ్లిష్‌లో) పేజీలు: 256+47, ధర: రూ. 81 అయిదు మోడల్ పేపర్ల అనుబంధం ఉచితం.

### ఏపీపీఎస్సీ

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథకాలు పేజీలు: 112, ధర: రూ. 63 **ప్రచురణ:** వీజీఎస్ బుక్‌లింక్స్

---

**టాప్ ర్యాంకర్ల విజయం గమనిస్తే.. వారు నిర్మించుకున్న నిర్దిష్ట సన్నద్ధత వ్యూహం కనిపిస్తుంది. ఇటీవల వెలువడిన నీట్ పీజీ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో 47వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు.. రామినేని కావ్య. ఆమె ప్రిపరేషన్ వ్యూహం ఏ తీరులో ఉంది? ఆమె మాటల్లోనే తెలుసుకుందాం!**

# సాధన, పునశ్చరణలతో సక్సెస్!

నా చిన్నతనంలో మా తాతగారు ఎక్కువగా జబ్బు పడుతుండేవారు. అది చూసి మా నాన్న బాధపడుతుండేవారు. మా ఇంట్లోనే ఒక డాక్టర్ ఉంటే బాగుండేదని ఆయన ఎప్పుడూ అంటుండేవారు. అందుకే నాకు వైద్యవృత్తిపై ఆసక్తి పెరిగింది. ఇంటర్ తరువాత ఎంబీబీఎస్ ఎంచుకోవడానికి కారణమైంది.

ఎంబీబీఎస్ చివరి సంవత్సరంలోనే పీజీ ప్రవేశపరీక్ష రాయాలని నిర్ణయించుకున్నాను. సన్నద్ధతను కూడా ఇంటర్న్‌షిప్ మధ్యలోనే మొదలుపెట్టాను. అయితే అది సీరియస్‌గా సాగిందని మాత్రం చెప్పలేను. అంతంతమాత్రంగానే సాగింది కానీ.. కొనసాగించాను. ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాక సీరియస్‌గా సన్నద్ధత సాగించాను. మిగతావారితో పోలిస్తే నేను కాస్త నెమ్మదిగా చదువుతాను. కాబట్టి నోట్స్ ఉంటే బాగుండనిపించింది. అందుకే శిక్షణ తీసుకోవాలనుకున్నాను. ప్రైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను. తరగతులకు తప్పనిసరిగా హాజరయ్యాను. ఏ వారం చెప్పిన పాఠాలను ఆ వారాంతానికి పూర్తయ్యేలా చూసుకున్నా. దానికి సంబంధించిన పుస్తకాలను చదవటం, ఎంసీక్యూలను సాధన చేయటం.. అలా ఆ వారంలో చెప్పిన అంశాలకు సంబంధించినవన్నీ పూర్తి చేయడానికి ప్రయత్నించాను. ఒక్కోసారి మొత్తం పూర్తిచేయడం కుదిరేది కాదు. కానీ అయినంతవరకూ పూర్తిచేసేదాన్ని.

### భవిష్యత్ పరీక్షార్థులకు..

నాలాగే అందరికీ కోచింగ్ తప్పనిసరి అని చెప్పలేను. ప్రవేశపరీక్షకు 19 సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ఎవరికి వారిపై పూర్తి అవగాహన ఉంటుంది. దాన్నిబట్టి సొంతంగా సాధన చేయగలమా లేదా అనేది నిర్ణయించుకోవాలి. దాని ప్రకారం పుస్తకాలు చదివి పరీక్ష రాయగలమా లేదా కోచింగ్ తప్పనిసరా అనేది నిర్ణయించుకోవచ్చు. కోచింగ్ తీసుకున్నా, సొంతంగా సిద్ధమైనా ప్రత్యేకంగా నోట్స్ రాసుకోవాలి. అది పునశ్చరణను సులభతరం చేస్తుంది.

చదవడంతోపాటు వాటికి సంబంధించిన ఎంసీక్యూలను సాధన చేయాలి. గత ప్రశ్నపత్రాలూ, మాక్ పరీక్షలను రాయడమూ చేయాలి. ఇవికూడా సన్నద్ధతలో భాగమే! అయితే ప్రతి సబ్జెక్టూ ముఖ్యమే. ఏదో ఒకదానిపైనే ఇష్టాన్ని ప్రదర్శించడం లాంటివి చేయొద్దు.

### పునశ్చరణ, గత ప్రశ్నపత్రాలూ...

రోజుకు 8 నుంచి 12 గంటలు సన్నద్ధతకు కేటాయించాను. ఒక్కోరోజు పరిస్థితులనుబట్టి దానిలో హెచ్చుతగ్గులూ ఉన్నాయి. పరీక్షకు నెలరోజుల సమయం ఉందనగా పునశ్చరణ ప్రారంభించాను. మొత్తంగా నేను చేసింది ఒక్కసారే! కానీ గత ప్రశ్నపత్రాలను మాత్రం సాధన చేశాను. ఎయిమ్స్ ఇంకా మిగతా ప్రవేశపరీక్షల గత ప్రశ్నపత్రాలు రెండు సంవత్సరాలవి సాధన చేశాను.

నీట్‌లో... చాలావరకూ మెమరీ ఆధారిత ప్రశ్నలే ఉంటాయి. దాదాపుగా సగానికిపైగా అని చెప్పొచ్చు. మిగతావి నాలెడ్జ్‌ను అప్లై చేసేలా, క్లినికల్ బేస్డ్‌గా ఉంటాయి. అందుకే సాధన తప్పనిసరి.

అయితే నేను కేవలం నీట్‌కే పరిమితం కాలేదు. ఎయిమ్స్, జిప్‌మర్, పీజీఐఎంఈఆర్ చండీగఢ్ ప్రవేశపరీక్షలనూ రాశాను. కానీ వాటిల్లో నాకు ర్యాంకు రాలేదు. అయితే ప్రిపరేషన్లో దోహదపడ్డాయి. ఒకరకంగా నీట్‌లో ర్యాంకు సాధనకు కూడా! వాటితోపాటు ఆన్‌లైన్ పరీక్షలనూ రాశాను. తద్వారా ఎప్పటికప్పుడు నా సన్నద్ధతను సమీక్షించుకోగలిగాను.



**రామినేని కావ్య**

■ **సొంత ఊరు:** గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కోవెలమూడి.

■ **నివాసం:** హైదరాబాద్- కూకట్‌పల్లి.

■ **నాన్న:** శ్రీనివాసరావు (పంచాయతీరాజ్ శాఖలో ఏఈ)

■ **అమ్మ:** ఝాన్సీలక్ష్మి (గృహిణి)

■ **ఏడో తరగతి వరకు:** కొండాపూర్‌లోని మహర్షి విద్యామందిర్. ■ **8-10 తరగతి వరకు:** నిజాంపేటలోని సంఘమిత్ర స్కూల్. ■ **పదో తరగతి:** 94% మార్కులు ■ **ఇంటర్:** శ్రీ చైతన్య కళాశాల. 97% మార్కులు ■ **ఎంసెట్:** 35వ ర్యాంకు. ■ **ఎంబీబీఎస్:** ఉస్మానియా మెడికల్ కాలేజ్. 70% మార్కులు

### చివరగా...

నా విజయాన్ని పూర్తిగా నా కుటుంబ సభ్యులు, స్నేహితులకే అంకితమిస్తాను. నా విజయానికి వారు అడుగడుగునా సహకరించారు. పీజీలో జనరల్ మెడిసిన్ చేద్దామనుకుంటున్నాను. ఏ కళాశాలలో చదవాలనేది ఇంకా నిర్ణయించుకోలేదు. పెద్ద పెద్ద లక్ష్యాలు పెట్టుకునే మనస్తత్వం కాదు నాది. అందుకే.. ఈ మూడేళ్ల పీజీని విజయవంతంగా పూర్తిచేయాలనే చిన్ని లక్ష్యాన్ని పెట్టుకున్నాను. దాన్ని సాధించే క్రమంలో.. మంచి కళాశాలను ఎంచుకునే ప్రయత్నంలో ఉన్నాను. ఇక ఉండనా!

---

## ప్రభుత్వ ఉద్యోగాలు

### ఏపీడీఆర్‌పీ, గుంటూరు

**సంస్థ:** ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్ట్ (ఏపీడీఆర్‌పీ), గుంటూరు
**పోస్టు:** ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్ తదితరాలు **ఖాళీలు:** 04 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, అనుభవం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరి తేది:** 28.03.2018, http://apdrp.ap.gov.in/

### పవర్ గ్రిడ్ కార్పొరేషన్

**పోస్టులు:** ఎగ్జిక్యూటివ్ ట్రైనీ **ఖాళీలు:** 31 (హెచ్‌ఆర్-25, లా-06) **అర్హత:** ఆయా సబ్జెక్టుల్లో ఎంబీఏ/ పీజీ/ పీజీ డిప్లొమా, ఎల్ఎల్‌బీ లేదా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా. **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** యూజీసీ నెట్-జులై 2018 స్కోరు, క్లాట్ 2018 స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.
**దరఖాస్తు ఫీజు:** రూ.500 హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ **ఆన్‌లైన్ దరఖాస్తు:** 01.07.2018 నుంచి 31.07.2018 వరకు. లా ఎగ్జిక్యూటివ్ **ఆన్‌లైన్ దరఖాస్తు:** 01.05.2018 నుంచి 31.05.2018 వరకు.
**వెబ్‌సైట్:** http://powergridindia.com/

### భెల్‌లో లా ఆఫీసర్లు

**సంస్థ:** భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) **పోస్టులు:** లా ఆఫీసర్-12 **అర్హత:** బీఎల్ లేదా ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత. **వయసు:** 30 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** క్లాట్-2018 (పీజీ) స్కోరు, ఇంటర్వ్యూ ద్వారా.
**ఆన్‌లైన్ దరఖాస్తు:** 02.04.2018 నుంచి 02.05.2018 వరకు
**వెబ్‌సైట్:** https://careers.bhel.in/

### కొచ్చి మెట్రో రైల్ లిమిటెడ్

**పోస్టు:** జనరల్ మేనేజర్, మేనేజర్ **ఖాళీలు:** 03 **అర్హత:** డిగ్రీ, ఏసీఎస్/ ఎఫ్‌సీఎస్, అనుభవం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 28.03.2018
**వెబ్‌సైట్:** http://kochimetro.org/

## నోటీస్ బోర్డు

### ఆయిల్ ఇండియా లిమిటెడ్

**పోస్టు:** సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్, సూపరింటెండింగ్ మెడికల్ ఆఫీసర్
**ఖాళీలు:** 09 **అర్హత:** డిగ్రీ, ఎంబీబీఎస్, ఎండీ, డీఎం, ఎంఎస్. **ఎంపిక:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, వైవా వాస్ ద్వారా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 06.04.2018
**వెబ్‌సైట్:** http://oil-india.com/

### కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్

**పోస్టులు:** సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెషనల్, డ్రాఫ్ట్స్‌మన్ ట్రైనీ **ఖాళీలు:** 19 **అర్హత:** సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ లేదా డిప్లొమా, పదోతరగతితోపాటు డిప్లొమా, అనుభవం.
**ఎంపిక:** రాత పరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
**చివరి తేది:** సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెషనల్స్‌కు మార్చి 31, డ్రాఫ్ట్స్‌మన్ ఖాళీలకు మార్చి 26.
**వెబ్‌సైట్:** www.cochinshipyard.com

### ఐసీఏఐ, కోల్‌కతా

**సంస్థ:** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ), కోల్‌కతా. **పోస్టులు:** డైరెక్టర్, ఆఫీసర్ తదితరాలు. **ఖాళీలు:** 33 **అర్హత, వయసు:** ఇన్‌స్టిట్యూట్ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 04.04.2018 **వెబ్‌సైట్:** http://icmai.in/

## వాక్ ఇన్ ఇంటర్వ్యూ

### ఐఎంఎంటీలో ప్రాజెక్ట్ స్టాఫ్

**సంస్థ:** సీఎస్ఐఆర్- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ, భువనేశ్వర్.
**పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ స్టాఫ్- 10.
**అర్హత:** డిప్లొమా, బీఈ/ బీటెక్, ఎంఎస్సీ.
**ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 21, 22. **వేదిక:** మీటింగ్ హాల్, ఐఎంఎంటీ, భువనేశ్వర్.
**వెబ్‌సైట్:** http://immt.res.in/